మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

పనులు కాకుండానే ప్రారంభాలా..?

- అవుకు రెండో టన్నెల్‌ను నేడు ప్రారంభించనున్న సిఎం - వ్యక్తమవుతున్న విమర్శలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలోని అవుకు రెండో టన్నెల్ పనులు పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించేందుకు నేడు గురువారం సిద్ధమయ్యారు. వాస్తవానికి సొరంగాల పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. వెయ్యి మీటర్ల మేర లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రారంభించామని చెప్పుకోవడానికే ప్రారంభం చేసేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణా జలాలను కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు తరలించేందుకు గత ప్రభుత్వాలు గాలేరు-నగరి సుజల స్రవంతి (జిఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును చేపట్టాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 30 టిఎంసిల వరద జలాలను గోరుకల్లు రిజర్వాయరుకు, అక్కడి నుంచి అవుకు రిజర్వాయరుకు తరలించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి కడప, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లోని 2.6 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాలకు తాగునీరు అందించాలన్నది అవుకు టన్నెల్ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ క్రమంలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయరుకు 20 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు 57.7 కిలో మీటర్ల మేర కాలువను నిర్మించాలని భావించారు. అయితే గోరుకల్లు నుంచి నీరు అవుకు రిజర్వాయర్లోకి వెళ్లేందుకు మధ్యలో భారీ కొండ అడ్డుగా మారింది. దీంతో 6 కిలోమీటర్ల మేర కొండను తొలచి సొరంగ మార్గం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీనికి గత ప్రభుత్వాలు ప్యాకేజీ-30 కింద పనులు చేపట్టాయి. అయితే పనులు కొలిక్కి రాలేదు. ఆ తర్వాత 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత సొరంగ మార్గంలో ఫాల్ట్ జోన్లు(మట్టి పొరలు బలహీనంగా ఉండి పై నుంచి మట్టి పెళ్లలు ఊడి పడుతున్న ప్రాంతం) ఏర్పడ్డాయి. కుడి సొరంగంలో 350 మీటర్లు, ఎడమ సొరంగంలో 160 మీటర్ల ఫాల్ట్ జోన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫాల్ట్ జోన్ కారణంగా టన్నెల్ పనులు ముందుకు సాగలేదు. దీంతో అప్పటి సిఎం చంద్రబాబు నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించారు. ఆ నివేదిక ప్రకారం కుడి సొరంగంలోని ఫాల్ట్ జోన్ ప్రాంతం నుంచి రెండు బైపాస్ సొరంగాలు తవ్వి, మట్టి పెళ్లలు ఊడిపోకుండా గడ్డర్లను ఏర్పాటు చేశారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటికి అవుకు టన్నెల్ పనుల్లో ఎడమ సొరంగం ఫాల్ట్‌జోన్ పనులు, లైనింగ్ పనులు మిగిలి ఉన్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సంవత్సరం లోపు ఈ టన్నెల్ పనులు పూర్తి చేస్తామని జగన్ చెప్పారు. అయితే రివర్స్ టెండరింగ్ పేరిట అప్పటికే పనులు చేస్తున్న కంపెనీని తప్పించి తమకు అనుకూలమైన కంపెనీకి కట్టబెట్టారు. రూ.108 కోట్లతో పనులు చేజిక్కించుకున్న సంస్థ పనులు చేట్టింది. ప్రభుత్వం బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో పనులు నెమ్మదించాయి. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన టన్నెల్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కుడి సొరంగంలోని నాన్ ఫాల్ట్ జోన్‌లో 200 మీటర్ల లైనింగ్ పనులు, ఆర్చి పనులు, ఎడమ సొరంగంలోని నాన్ ఫాల్ట్ జోన్‌లో 800 మీటర్లు లైనింగ్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. మరో వైపు కాంట్రాక్టర్లకు రూ.3 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు సుముఖత చూపడం లేదని సమాచారం. పనులు పెండింగ్‌లో ఉండగానే టన్నెల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తుండటంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవుకు టన్నెల్

ఎస్ఆర్‌బిసి ఆయకట్టుకు అన్యాయం

ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. ప్రాజెక్టుల్లోకి కూడా నీరు సరిగా చేరలేదు. ముఖ్యంగా ఎస్ఆర్‌బిసి కింద లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండటంతో గోరుకల్లు రిజర్వాయర్ మీదే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం అవుకు టన్నెల్‌ను సిఎం ప్రారంభిస్తున్న సందర్భంగా దాదాపు రెండు టిఎంసిల నీటిని గోరుకల్లు నుంచి అవుకుకు తరలించేందుకు సిద్ధమయ్యారు. 12.4 టిఎంసిల సామర్థ్యం ఉన్న గోరుకల్లులో ప్రస్తుతం 8 టిఎంసిల నీళ్లే ఉన్నాయి. ఉన్న నీటిలో 2 టిఎంసిలు తరలిస్తే ఎస్ఆర్‌బిసి ఆయకట్టుకు అన్యాయం చేసినట్లు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారుల అనాలోచిత నిర్ణయంతో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారం కోసమే..

ఎప్పుడో పూర్తి కావాల్సిన టన్నెల్ పనులు నిధులు ఇవ్వకపోవడం వల్ల ఆలస్యం అయ్యాయి. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని ప్రచారం కోసం పనులు పూర్తి కాకుండానే టన్నెల్‌ను ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్‌లో నీళ్లు లేక ఎస్ఆర్‌బిసి ఆయకట్టు కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. నీళ్లు ఉన్నప్పుడు తీసుకెళ్తే ఎవరికీ ఇబ్బంది లేదు. నీళ్లు లేనప్పుడు ప్రచారం కోసం నీటిని తరలించాలని చూడడం మంచిది కాదు.

- టి.రమేష్ కుమార్, సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి.

తప్పుల్లేని ఓటర్ల జాబితా ఇస్తాం

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, ఫోటోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ కు సంబంధించి రీ వెరిఫై చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ పార్టీలు ఏమైనా పొరపాట్లను గమనించి ఉంటే అందుకు సంబంధించి ఫార్మ్ 6, 7, 8 రూపంలో ఇఆర్ఒ లకు అంద చేయాలని కలెక్టర్ సూచించారు. బిఎల్ఓలు ఎన్నికలకు సంబంధించిన పనులను జాగ్రత్తగా, బాధ్యతతో విధులు నిర్వర్తించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితాకు సంబంధించి వారు గమనించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు..సమావేశంలో టిడిపి పార్టీ ప్రతినిధి, ఎమ్మెల్సీ బిటి నాయుడు, టిజి. భరత్, కెఇ. ప్రభాకర్, కెఇ. శ్యాంబాబు, జయ నాగేశ్వరరెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి సెల్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, టిడిపి బీసీ సెల్ ప్రెసిడెంట్ సత్రం రామకృష్ణుడు, వైసిపి స్టేట్ లీగల్ సెక్రెటరీ పుల్లారెడ్డి, బిజెపి నుండి సాయి ప్రదీప్, బిఎస్‌పి నుండి రాజేష్ పాల్గొన్నారు.

'మతోన్మాద బిజెపిని గద్దె దించుదాం'

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దె దించాలని కెవిపిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం దళితుల సమస్య పరిష్కారానికి మతోన్మాద బిజెపిని గద్దె దించాలని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కెవిపిఎస్ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగర అధ్యక్షులు జి ఏసు అధ్యక్షతన వీకర్ సెక్షన్ కాలనీ, షరీన్‌నగర్ ల లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నగర కార్యదర్శి ఎం. భాస్కర్ మాట్లాడుతూ దేశంలో దళితులకు రక్షణ కల్పించాలని దళితులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న మతోన్మాద బిజెపిని గద్దె దించాలని సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ప్రజలనుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని సేకరించిన సంతకాలను డిసెంబర్ 4న రాష్ట్రపతికి సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పిస్తామని తెలిపారు. నగర కమిటీ సభ్యులు ఎం.జమ్మన్న , వార్డు కార్యదర్శి కిరణ్ , వార్డు అధ్యక్షులు హనుమంతు, వార్డు నాయకులు జానీ, రాజు నగర కమిటీ సభ్యురాలు సరోజమ్మ ఈశ్వరమ్మ వార్డు నాయకులు పాల్గొన్నారు .

సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

2, 3న పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డిసెంబర్ 2, 3 తేదీలలో పోలింగ్ స్టేషన్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి ఓటర్ల నమోదు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను బూత్ లెవెల్ ఆఫీసర్లు స్వీకరిస్తారని కమిషనర్ ఎ.భార్గవ్ తేజ చెప్పారు. బుధవారం కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ ఎస్‌బిఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాల్లో సెక్టోరల్ ఆఫీసర్స్, స్పెషల్ ఆఫీసర్స్, బూత్ లెవెల్ ఆఫీసర్స్‌తో నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 2, 3వ తేదీలలో పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహించి ఓటర్ల జాబితాలో నమోదు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను బూత్ లెవెల్ ఆఫీసర్లు స్వీకరించాలని, వాటిని త్వరిత గతిన ప్రాసెస్ చేయాలని, సెక్టోరల్ ఆఫీసర్స్ , స్పెషల్ ఆఫీసర్స్ ఈ క్యాంపెయిన్లను తనిఖీ చేసి, ప్రత్యేక ప్రవేశం , నిష్క్రమణ దారులుండేలా, వీల్ చైర్ రాంప్ యాక్సెస్ ఉండేలా, విద్యుత్, టాయిలెట్లు, వంటి కనీస సౌకర్యాలు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుని, పూర్తి నిబద్ధతతో ఈ క్యాంపెయిన్లు జరిగేలా చూడాలని ఆదేశించారు. డిసెంబర్ 9న, ఓటర్ల జాబితాలో తమ దృష్టికి వచ్చిన దావాలు, అభ్యంతరాలు నమోదు చేసి సరి చెయ్యడానికి ఆఖరి తేదీ నాటికి దరఖాస్తులను క్లియర్ చెయ్యాలని బూత్ లెవెల్ ఆఫీసర్లను కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ , డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, కర్నూల్ అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ ఎలక్షన్స్ ధనుంజయ్ , సెక్టోరల్ ఆఫీసర్స్, స్పెషల్ ఆఫీసర్స్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది , బూత్ లెవెల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్ తేజ

పరిశ్రమలకు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో గుట్టపాడు క్లస్టర్‌లో మౌలిక వసతులు, ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ పార్కులో ఫార్మస్యూటికల్స్, న్యూట్రాస్యూటికల్స్ పరిశ్రమల ఏర్పాటుకు, పత్తికొండ మండలంలో టమోట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు బుధవారం వర్చువల్ విధానంలో సీఎం జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన , పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయ మనోహరి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధులతో రూ.21.40 కోట్లతో 219 ఎకరాల్లో ఓర్వకల్లు మండలం గుట్టపాడు క్లస్టర్‌లో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ సదుపాయం కల్పించి పారిశ్రామికవేత్తలకు అందజేస్తామన్నారు. ఈ పనులకు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారన్నారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ పార్కులో రూ.280 కోట్ల పెట్టుబడితో శిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయనున్న యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియంట్స్ పరిశ్రమకు ఎపిఐఐసి ద్వారా 25 ఎకరాలు కేటాయించామని, ఈ పరిశ్రమకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని కలెక్టర్ తెలిపారు. ఇక్కడే ఆర్‌పిఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.90 కోట్ల పెట్టుబడితో న్యూట్రాస్యూటికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు ఎపిఐఐసి ద్వారా 11 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని, దీనికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని కలెక్టర్ వివరించారు. ఈ పరిశ్రమల ద్వారా దాదాపు 1200 మందికి ఉపాధి లభించనుందన్నారు. పత్తికొండ పర్యటనలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు రూ.12.05 కోట్లతో పత్తికొండ మండలంలో 3.60 ఎకరాల విస్తీర్ణంలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని, దీనికి కూడా ఈ రోజు శంకుస్థాపన చేశారన్నారు. కర్నూలు జిల్లాలోని 10 మండలాలు, నంద్యాల జిల్లాలోని రెండు మండలాలు కలిపి మొత్తం 12 మండలాల్లో 4788 హెక్టార్లలో 1.68 లక్షల మెట్రిక్ టన్నుల టమోటా పండిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ యూనిట్ ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ టమోటా పౌడర్, కెచప్, సాస్ తదితర పదార్థాలను తయారు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం ద్వారా రైతులు ఎంతో లబ్ధి పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కంగాటి శ్రీదేవి సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోమశేఖర్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇడి ఉమాదేవి, పరిశ్రమల శాఖ జిఎం ప్రసాద్, నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి సంజీవ్‌కుమార్, బిఎస్ఎన్ఎల్ జిఎం.రమేష్

అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమాజాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తానని టిఎసి ఛైర్మన్, ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం బిఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా మూడవ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని బిఎస్ఎన్ఎల్ కర్నూలు కార్యాలయంలో ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ అధ్యక్షతన జిఎం జి.రమేష్ నిర్వహించారు. టిఎసి సభ్యులు ఎస్.రమేష్, కె. శాంతికుమార్, కె. కృష్ణ రెడ్డి, సయ్యద్ రోషన్ అలీ, ఎం.కుబేర స్వామి, బి.మధు బాబు నాయుడు, సి.అజయ్ కుమార్, కె.భాస్కర్‌రెడ్డి, డి భీమేష్, బిఎస్ఎన్ఎల్ డిజిఎం బి.సాయినాథ్, ఇతర బిఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో టిఎసి సభ్యులు బిఎస్ఎన్ఎల్ కి సంబంధించిన సమస్యలను లేవనెత్తారు, వీలైనంత త్వరగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పులికొండ, విరుపాపురం, యాటకల్లు, దొడ్డిమేకల, రామతీర్థం, ఎం.పెండేకల్, యర్రగుడి, గోసానిపల్లి, వెంగళంపల్లిలో 4జి సాచురేషన్ ప్రాజెక్ట్‌లో తొమ్మిది సైట్‌లను చేర్చినందుకు ఎంపికు జిఎం ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల భవిష్యత్తు కోసం టిడిపిని గెలిపించండి

టిడిపి కర్నూలు ఇంచార్జి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాష్ట్రంలోని ప్రజల భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని మౌర్య ఇన్ ఆయన కార్యాలయంలో టిడిపి నేత మన్సూర్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో గనిగల్లి ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ బృందం యువత, మహిళలు భారీగా టిడిపిలో చేరారు. టిజి భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే కర్నూలు యువతకు మంచి భవిష్యత్తు అందిస్తానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాలు బాగుపడతాయని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటేస్తే ఐదేళ్లు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవించే అవకాశం ఉంటుందన్నారు. ఇక కర్నూలు ప్రజలు మంచి చేసే నాయకుడు ఎవరో వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. మంచి భవిష్యత్తు కోసం తనని గెలిపించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో మెహబూబ్, రఫిక్, హమీద్, యాఫజ్, జిషాన్, సోను, తదితరులు ఉన్నారు.

టిడిపిలో చేరిన వారితో టిజి.భరత్

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం

గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి ఆరోపించారు. బుధవారం వైసిపి ప్రభుత్వంలో బీసీల పై జరుగుతున్న దాడులపై మాధవి నగర్ నివాసంలో గౌరు దంపతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. బిసిలపై జరుగుతున్నదాడుల గురించి వివరించి బుక్ లెట్‌ను లాంచ్ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సగానికి పైగా బిసి జనాభా ఉన్నప్పటికీ వారికి కేటాయిస్తున్న పదవుల్లో మాత్రమ్ నామ మాత్రంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బిసిలకు కేటాయించిన పదవులు ఇలా ఉన్నాయి నామినేటెడ్ పదవులు 1082 ఉండగా రెడ్డి సామాజిక వర్గానికి 671, బిసిలకు 5 పదవులు మాత్రమే కేటాయించారు. ఇలా వైస్ ఛాన్సులర్స్ 36 ఉండగా రెడ్లకు 11, బీసీలకు 3, సలహాదారులు 12 ఉండగా రెడ్లకు 10 బీసీలకు ఒకటి, విప్ 55 ఉండగా రెడ్లకు 27 బీసీలకు నాలుగు, ప్రభుత్వ న్యాయవాదులు 8 ఉండగా రెడ్లకు నాలుగు బిసిలకు ఒకటి, యూనివర్శిటీ ఇసిమెంబర్స్ 30 ఉండగా రెడ్లకు 16 బిసిలకు 5, యూని వర్శిటీ సెర్చ్ కమిటీ 116 ఉండగా రెడ్లకు 32 బిసిలకు నాలుగు, గత ప్రభుత్వ పాలనపై విచారణ కమిటీ 12 ఉండగా రెడ్లకు 9 బిసిలకు ఒకటి, వైద్యారోగ్యశాఖ సంస్కరణల కమిటీ 9 ఉండగా రెడ్లకు ఆరు బిసిలకు జీరో, ఉన్నత స్థాయి సంప్రదింపుల కమిటీ ఐదు ఉండగా రెడ్లకు మూడు బిసిలకు ఒకటి, వ్యవసాయమిషన్ ఆరు ఉండగా రెడ్లకు నాలుగు, బిసిలకు జీరో, ప్రైవేట్ యూనివర్శిటీ ప్రతిపాదన కమిటీ ఆరు ఉండగా రెడ్లకు మూడుబిసిలకు రెండు పదవులను కేటాయించాలని పేర్కొన్నారు. బీసీల వెన్నువిరుస్తున్న జగన్రెడ్డి... బీసీల అభివద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను వైసిపి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా దారీ మళ్లించిందని ఆరోపించారు. రూ 75.760 కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. ఆదరణ లాంటి 30కి పైగా బిసి సంక్షేమ పథకాలను రద్దు చేశారని తులిపారు. రిజర్వేషన్లు 34 శాతం నుండి 24 శాతం కి తగ్గించి 16,800 రాజ్యాంగ బద్ద పదవులు దూరం చేశారని, 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అందులో అత్యధిక భాగం బీసీలవే అనారు. 70వేలకు పైగా బిసి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. 13 బీసీ భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను నిలిపివేశారన్నారు. సీనియారిటీలో 5వ స్థానంలో ఉన్న ద్వారకాతిరుమలరావు (బీసీ)ని తప్పించి 16వ స్థానంలో ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డిని డిజిపిగా నియమించిన జగన్‌మోహన్‌రెడ్డి బిసిల నడ్డి విరిచారని ధ్వజమెత్తారు.

ఎఐకెఎస్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సోమిశెట్టి నగర్ కాలనీలోని యుటిఎఫ్ ఆఫీస్‌లో 19, 20 వార్డు కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం వార్డు నాయకులు షేక్. మాలిక్‌బాష అధ్యక్షతవహించారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఎం.సుబ్బరాయుడు పాటలు పాడి సభను ఉత్తేజపరిచారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు , 19,20 వార్డులశాఖ కార్యదర్శి బి.రాధాకష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల పైన భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేస్తూ, ప్రభుత్వ రంగాలన్నీ ప్రైవేటు పరం చేశారన్నారు. రైతు ఈ నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతాంగం పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమై సంవత్సరంన్నర పాటు సుదీర్ఘ పోరాటం చేసినా దున్నపోతు మీద వాన కురిసినట్టు కేంద్ర పాలకులు వ్యవహరించారన్నారు. నరేంద్ర మోడీకి ముక్కుకు తాడువేసి మెడలు వంచి రైతులకు వ్యతిరేకంగా చేసిన నల్ల చట్టాలను రద్దు చేస్తానని, నాది తప్పయిందని చంపలేసుకునేలాగా సుదీర్ఘ పోరాటం చేసిన చరిత్ర రైతాంగానికి దక్కిందన్నారు. మొద్దు నిద్ర పోతున్న ఈ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని నిద్ర లేపడం కోసం మరో పోరాటానికి సిద్ధమవువడానికి కర్నూలు నగరంలో ఎఐకెఎస్ కౌన్సిల్ సమావేశాలు, భారీ బహిరంగ సభను డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో జరగబోతున్నాయన్నారు. భారతదేశ నలుమూలల నుండి విచ్చేయుచున్న పోరాటయోధులకు ఆతిథ్యం ఇవ్వాలని, ఈ సభల విజయవంతం కోసం పార్టీ సభ్యులు కార్యకర్తలు ప్రజలందరూ కూడా విరివిగా విరాళాలు ఇచ్చి, డిసెంబర్ 15న జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. సిపిఎం వార్డు నాయకులు శివకృష్ణ, స్వాములు, వెంకటేశ్వర్లు, ఫరూక్, రాజు, శేఖర్, విజయ్, ఎలీషా, మధు, బుజ్జి, వార్డు మహిళా సంఘం నాయకురాలు సీతమ్మ, అనురాధ పాల్గొన్నారు.

ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కెవిసుబ్బారెడ్డి దంతపులు

డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఫార్మసీలో ఓరియంటేషన్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన బిఫార్మసీ , ఫార్మ డి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్(అవగాహన కార్యక్రమం) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరికీ నిజమైన ఎం-మోరల్, ఎ-ఏబుల్, ఎన్.నోబుల్ అనగా నైతిక విలువలు శక్తి సామర్థ్యాలు ఉన్నత ఆశయాలు గల వ్యక్తులుగా తీర్చిదిద్దడమే ఈ కళాశాల ధ్యేయమని చెప్పారు. కరస్పాండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణ కష్టపడి చదవడం అనే రెండు లక్షణాలు పెంపొందించుకొని తమకన్నా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బివి.రమణ మాట్లాడుతూ రాయలసీమలో అత్యంత పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఈ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తలిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఇతర ప్రొఫెసర్లు హెచ్ఒడి లు మాట్లాడుతూ నాక్ఎ గ్రేడ్ సాధించి అటానమస్ స్థాయిని త్వరలో అందుకోబోతున్న ఈ కళాశాల విద్యార్థుల కలలను నిజం చేస్తుందని పేర్కొన్నారు. నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కాల్వలు, రోడ్లు వేయండి ఎమ్మెల్యే సారూ..

కొండాపురంలో ఎమ్మెల్యేను నిలదీసిన స్థానికులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి.మండలంలోని కొండాపురంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు నిలదీశారు. గ్రామంలో సిసి రోడ్లు ఉన్నా మురుగు కాల్వలు లేవని, భూ సర్వేలో అనేకం అవకతవకలు జరిగాయని, ప్రధానంగా రహదారులు బాగా లేక బస్సులు రాక ప్రయాణ అవస్థలుపడుతున్నారని పలువురు వాపోయారు. ఎమ్మెల్యే స్పందించి చర్యలు చెపడతామని పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. బాబురావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రకతి ప్రసాదించిన ఇసుకకు నేటి ప్రభుత్వాలు వ్యాపారం చేస్తున్నాయని పాలకులు, వారి అనుచరులు వేలకోట్లు ఇసుకపై అక్రమ సంపాదన సంపాదిస్తున్నారన్నారు. కృత్రిమ కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషన్లు ,వారి కుటుంబాల కడుపులు కొడుతున్నారన్నారు. ఇసుకను అందుబాటులోకి తెలిచ్చి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండాలని పేర్కొన్నారు

వైభవంగా కడ్లే గౌరమ్మ రథోత్సవం

- ముఖ్య అతిథులుగా మంత్రి గుమ్మనూరు జయరామ్ హాజరు

ప్రజాశక్తి - చిప్పగిరి

నూతన రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

మండలంలోని దేగల పాడు గ్రామంలో బుధవారం ఎంపిపి జూటూరు హేమలత, సర్పంచి నీలకంఠ, సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున, వైఎస్ఆర్ మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో కడ్లే గౌరమ్మ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, కర్ణాటక మంత్రి నాగేంద్ర, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ స్వామి వైసిపి నాయకులు, కార్యకర్తలు తప్పెట్ల, వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. అమ్మవారికి మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన రథోత్సవాన్ని ప్రారంభించి తిలకించారు. చిన్నపిల్లలు వేసిన చెక్కభజన ఆకట్టుకున్నది. నూతన రథోత్సవానికి మంత్రి గుమ్మనూరు జయరామ్ రూ.5 లక్షలు అందజేశారు.

కడ్లే గౌరమ్మకు కలశాల బహుకరణ

కడ్లే గౌరమ్మ అమ్మవారికి చిప్పగిరి బంగారు షాపు యజమానులు దేవరమ్మ గారి సత్యన్న, ప్రతాప్ రూ.50 వేల విలువచేసే కలశాలను గ్రామ పెద్దల సమక్షంలో అమ్మవారి ఆలయ పెద్దలకు అందజేశారు.

చదువే పిల్లలకు ఇచ్చే పెద్ద ఆస్తి

- ఎమ్మెల్యే చెన్న కేశవ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్న కేశవ రెడ్డి

'మీ పిల్లలకు మీరిచ్చే పెద్ద ఆస్తి చదువే. ప్రతి ఒక్కరూ పిల్లలను కచ్చితంగా చదివించాల'ని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో నూతన సచివాలయాన్ని ప్రారంభించి, ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు పెద్ద పీట వేస్తున్నారని, విద్య ఉంటే ఎక్కడైనా బతకగలరని తెలిపారు. 5 ఏళ్ల టిడిపి పాలనలో నాగులదిన్నె బ్రిడ్జికి నిధులు రాకపోతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత తానే స్వయంగా వెళ్లి రూ.16 కోట్ల నిధులు విడుదల చేయించినట్లు తెలిపారు. సర్పంచి లక్ష్మి, వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, విరుపాక్షి రెడ్డి, అత్తావుల్లా, శరత్ కుమార్, నాగప్ప, బోయ తిమ్మప్ప, ఎంపిడిఒ దశరథ రామయ్య, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, పిఆర్ ఎఇ జయన్న, ఎస్ఐ తిమ్మయ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తున్న జగన్మోహన్ రెడ్డి

సంక్షేమం, అభివృద్ధి జగనన్న ప్రభుత్వ లక్ష్యమని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 18, 19వ వార్డు సచివాలయం పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరించి, సంబంధించిన కరపత్రాలను అందజేశారు. వార్డులో విద్యుత్ స్తంభాలు, రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబానికి సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

నిత్యావసర సరుకులు అందిస్తున్న దివాకర్ నాయుడు

దేవనకొండ ఎస్సీ కాలనీలో గుడిసె దగ్ధమైన దళిత రామాంజనేయులు కుటుంబాన్ని సహకార సొసైటీ అధ్యక్షులు లక్ష్మీ దేవమ్మ కుమారుడు, వైసిపి మండల నాయకులు దివాకర్ నాయుడు బుధవారం పరామర్శించి, రూ.10 వేల విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. వైసిపి నాయకులు చిట్టెం చిన్నయ్య శెట్టి, కరివేముల ఎల్‌కె.శ్రీనివాసులు, తిరుమలేష్ నాయుడు, సహకార సొసైటీ సిబ్బంది రమణ, వేణుగోపాల్ రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

తుంగభద్రపై వరద కాలువ నిర్మించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నుంచి వలసలను నివారించేందుకు తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించాలని వక్తలు తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేశులు, మల్లయ్య, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, రైతుకూలీ సంఘం నాయకులు జగదీష్, సిపిఐ నాయకులు ఈరన్న మాట్లాడారు. జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. వర్షాకాలంలో తుంగభద్ర నది నుంచి సుమారు 100 టిఎంసిల వరద జలాలు సముద్రం పాలవుతున్నాయన్నారు. ఆ జలాలను ఉపయోగంలోకి తీసుకొచ్చి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. మండలంలోని మేలిగనూరు గ్రామం వద్ద తుంగభద్ర నదిపై సమాంతర వరద కాలువ నిర్మిస్తే జిల్లాలో సాగునీటి అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమాంతర కాలువ ద్వారా మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు పత్తికొండ నియోజకవర్గాల్లో 5 నుంచి 10 టిఎంసిల నీరు నిల్వ చేసుకుంటే జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సారవంతమైన భూములు ఉన్నాయని, ఆ భూములకు సాగునీరందితే బంగారు పంటలు పండుతాయని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తే లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు. కరువును శాశ్వతంగా నివారించవచ్చని తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువకు డిసెంబర్ 10 వరకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. డిసెంబర్ 15, 16, 17న కర్నూలులో జరిగే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కౌతాళం : సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశులు

ఆదోనిరూరల్ : డిసెంబర్ 15, 16, 17న కర్నూలులో జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. ఆదోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించి, గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో, ఎరువుల ధరలు, బ్యాంకు రుణాలు మాఫీ చేయడంలో బిజెపి పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈ పదేళ్లలో బడా కార్పొరేట్లకు రూ.14 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం, రైతుల అప్పుల గురించి మాట్లాడే పరిస్థితి లేదని మండిపడ్డారు. మరోవైపు జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలును కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవేందుకు వేలాది మంది రైతులతో డిసెంబర్ 15న కర్నూలు నగరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, అయ్యప్ప, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.రామాంజనేయులు, వీరారెడ్డి, నాయకులు మదిరే తిక్కన్న, హనుమంతు రెడ్డి, ఏలియా, కెవిపిఎస్ మండల నాయకులు లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆదోనిలో అంతులేని భూకబ్జాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో భూకబ్జాలకు అంతులేకుండా పోయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ విమర్శించారు. బుధవారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూకబ్జాలు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగి పోయాయన్నారు. ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులే పంచాయితీలు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అనుచరులు పట్టణమంతా తిరుగుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే దాడులకు పాల్పడతారన్నారు. గతంలో ఆటో కార్మికునిపై దాడి చేశారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ వేసే వారిని బెదిరించారని తెలిపారు. ఎమ్మెల్యేకు గతంలో ఆదోని పరిసర ప్రాంతంలో ఇల్లు తప్ప వేరే ఆస్తులు లేవన్నారు. వారి సొంత ప్రాంతం కొనకండ్ల, రాంపురంలో స్థిర, చర ఆస్తులు ఉండేవని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఈ 20 ఏళ్లలో ఆయన, కుటుంబ సభ్యులు, అనుయాయుల పేర్లపై వందల ఎకరాల భూమి, రూ.వందల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వీటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

'ఆడుదాం ఆంధ్ర' : ఎంపిడిఒ

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీసేందుకే

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపిడిఒ రాణెమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఆడుదాం ఆంధ్ర'ను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని తెలిపారు. 15 ఏళ్ల పైబడి ఆసక్తి ఉన్న యువత గ్రామ వార్డు సచివాలయం, వాలంటీర్లు, 1902 ద్వారా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు

కొనసాగుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నియోజకవర్గ స్థాయిలో గెలిచిన క్రీడాకారులకు రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు, జిల్లాస్థాయిలో గెలిచిన క్రీడకారులకు రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో గెలిచిన క్రీడాకారులకు రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో బ్యాడ్మింటన్ గెలుపొందిన క్రీడాకారులకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, జిల్లాస్థాయిలో గెలిచిన క్రీడాకారులకు రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో గెలిచిన క్రీడాకారులకు రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేల బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- దేవనకొండ

డిసెంబర్ 2, 3న కర్నూలు నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పత్తికొండ డివిజన్ నాయకులు చిన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి, రవితేజ కోరారు. బుధవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై, 'చదువు-పోరాడు' నినాదంతో విద్యారంగ పరిరక్షణకు ఉద్యమిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. దేవనకొండలో మోడల్ స్కూల్ డిఎన్‌టి హాస్టల్ పునరుద్ధరణ, డిగ్రీ కళాశాల ఏర్పాటు, అన్ని గ్రామాల నుంచి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, వంశీ, వీరేంద్ర, రజాక్ పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో సాహసోపేత నిర్ణయం

- వైసిపి ఇన్‌ఛార్జి జయమనోజ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అధికారంలో వచ్చిన ప్రారంభంలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా 1.30 లక్షలు, పరోక్షంగా 4 లక్షల ఉద్యోగాలు కల్పించి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని వైసిపి ఇన్‌ఛార్జి జయ మనోజ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదోనిలోని 14వ వార్డులోని చిన్నమార్కెట్ వద్ద మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వార్డు ఇన్‌ఛార్జి రామలింగేశ్వర్ యాదవ్‌తో కలిసి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, సన్నీ, శ్రీనివాస్ రెడ్డి, కామాక్షి నారాయణ, అజీమ్, ఈశ్వర్, మల్లిక, చలపతి, జిల్లా ఉపాధ్యక్షులు జులేకాబీ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, జలీల్, మనీ పాల్గొన్నారు.

భూపంపిణీతో పేదలకు శాశ్వత ప్రయోజనం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి-ఆలూరు

భూపంపిణీతో పేదలకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు శాశ్వత హక్కు కల్పిస్తూ అసైన్‌మెంట్ భూమి పట్టాలు, వ్యవసాయ స్వేచ్ఛా సంపూర్ణ భూమి హక్కు పత్రాలను బుధవారం మంత్రి గుమ్మనూరు జయరామ్ పంపిణీ చేశారు. ఆలూరులోని ఇబ్రహీం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తొలి విడతగా అసైన్‌మెంట్ కమిటీకి సంబంధించి 709 మంది పట్టాదారులకు 889.31 ఎకరాల భూములకు పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేద ఎస్సీ మహిళలకు కల్పించిన పట్టాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శాశ్వత హక్కులు కల్పిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు

పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరామ్

మండలాల్లో 495 మంది పట్టాదారులకు 834.51 ఎకరాల భూమిని రైతులకు పట్టాలుగా ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆలూరు మండల లబ్ధిదారులకు ఇస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 5 మండలాల లబ్ధిదారులకు త్వరలోనే ఇస్తామన్నారు. గత ప్రభుత్వం పేదలకు భూపంపిణీపై చొరవ చూపలేదన్నారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, ఆర్‌డిఒ ఎస్.రామలక్ష్మి, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, జడ్‌పిటిసిలు ఏరూరు శేఖర్, లింగప్ప, ఎంపిపి జి.రంగమ్మ పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను అమలు చేసే వారికే మద్దతు

- యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత

ప్రజాశక్తి - ఆదోని

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిన వారికే రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.జీవిత, జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప తెలిపారు. బుధవారం మున్సిపల్ హైస్కూల్‌లో యుటిఎఫ్ మండల అధ్యక్షులు వై.రామాంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో పాదయాత్రలో భాగంగా ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తానని మాట ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లు కాలయాపన చేసి గ్యారంటీ పెన్షన్స్ స్కీమ్ విధానాన్ని తీసుకుని రావడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రయివేటీకరణ వైపు మొగ్గు చూపుతున్నాయని, విద్యారంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాడతామని తెలిపారు. అనంతరం ఆదోని రూరల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా ఎం.రాముడు, జి.కల్యాణి, ఆర్థిక కార్యదర్శిగా జి.నాగేంద్ర, కార్యదర్శులుగా ఉరుకుందయ్య, సిద్ధప్ప, ఈరన్న, హనుమంతు, జనార్ధన్, శ్రీకాంత్, రంగనాయకులు, తేజ, వెంకటరమణ, రేణుక భాయి, భారతి, అరుణ జ్యోతి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా హుసేని, వై.రామాంజనేయులు, పాపయ్య, రుద్రముని, భోజరాజు, సిహెచ్.పెద్దయ్య, శివకుమార్ గౌడ్, నర్సయ్య గౌడ్, భాగ్యలక్ష్మి, అన్నపూర్ణ, జనార్దన్, మహిళా విభాగం కన్వీనర్ సుజాత, అకాడమిక్ విభాగం కన్వీనర్ బి.మల్లయ్య, సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఆవుల బసప్ప, ఆడిట్ కన్వీనర్ వేణుగోపాల్, సిపిఎస్ కన్వీనర్ జి.రామాంజనేయులును ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మృతుని కుటుంబానికి తక్షణసాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

అనారోగ్యంతో మృతి చెందిన కంసలి పరమేష్ కుటుంబానికి తక్షణ సహాయం కింద సర్పంచి భీమయ్య రూ.10 వేల నగదును అందజేశారు. రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన పరమేష్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సర్పంచి భీమయ్యను పంపించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ వెల్ఫేర్ అధికారి అనిత చేతుల మీదుగా నగదును అందజేశారు. మిగతా నగదును నామినీ కె.ఎల్లప్ప ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. వార్డు సభ్యులు రామాంజనేయులు, వాలంటీరు నరసింహ ఉన్నారు.

'అలసత్వం వహిస్తే చర్యలు'

మంత్రాలయం : ఓటరు జాబితా సర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమా హెచ్చరించారు. బుధవారం పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాను ప్రక్షాళన చేసి సరైన జాబితా తయారు చేయాలని సూచించారు. బిఎల్‌ఒలు ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టాలని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి : హాలహర్వి సమీపంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... కర్ణాటక బళ్లారి జిల్లాకు చెందిన జాలపాడు గ్రామం శివ బుధవారం కర్ణాటక మోక నుంచి బైక్‌పై 288 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా హాలహర్వి నుంచి అర్ధగేరి గ్రామానికి వెళ్లే దారిలో పట్టుకున్నారు. బైక్‌ను సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు గోవర్ధన్, నాయక్, అశోక్, అయ్యస్వామి పాల్గొన్నారు.

శ్రీమఠంలో లక్ష పుష్పార్చనతో పూజలు

మంత్రాలయం : శ్రీమఠంలో రాఘవేంద్రుని మూల బృందావనానికి పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు లక్ష పుష్పార్చనతో విశేష పూజలు నిర్వహించారు. బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ అఖిల భారత శ్రీవిజయదాసుల ఆరాధన సమితి ఆధ్వర్యంలో శ్రీమఠంలోని యాగశాలలో పవిత్ర ధాత్రి హోమం నిర్వహించారు. శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతులు లక్ష పుష్పార్చనతో మంగళ హారతులు ఇచ్చారు.

టిడిపి మేనిఫెస్టోతో భవిష్యత్తుకు గ్యారెంటీ

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోతోనే రాష్ట్రంలోని ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం నందవరం బీసీ కాలనీలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాల ద్వారా పొందే లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం నందవరంలో నూతనంగా నిర్మించి, విగ్రహ ప్రతిష్టాపన చేసిన అయ్యప్ప స్వామి దేవాలయాన్ని దర్శించి, పూజలు నిర్వహించారు. జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పవతి, టిడిపి నాయకులు గురురాజ్ దేశాయి, ఖాసీం వలీ, చిన్న రాముడు, గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, వడ్డే గోపాల్, రామన్న గౌడ్, రెహ్మాన్, భీమన్న పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని నగరూరు, బిణిగేరి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి కోట్ల సుజాతమ్మ మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా నీటి సమస్య, సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ పరమారెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, ఎంపిటిసిలు నరసన్న, రహీంతుల్లా, మాజీ ఎంపిటిసి ఎల్లప్ప, నాయకులు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్, మురళీ రెడ్డి, గోవిందు, రఘు, కృష్ణ, రాజ్‌కుమార్, బద్రి, గోపాల్, నారాయణ, రంగస్వామి, సతీష్ పాల్గొన్నారు.

ఆదోని : దళితుల రక్షణ కోసం ఏర్పాటైన చట్టాలను దళితులపైనే ప్రయోగించడం విడ్డూరంగా ఉందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఆదోనిలోని ఇందిరానగర్ బ్రాహ్మణ కాలనీలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని విమర్శించారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, పట్టణ మైనార్టీ నాయకులు సాధిక్ వలీ, పట్టణ ఉప్పర సంఘం శాంతమూర్తి, ఎరుకుల శేషు, ఎరుకల గోపాల్, రాఘవేంద్ర రెడ్డి, బాబురావు, తెర్నేకల్ కృష్ణ, విఎం.తిక్కన్న, బిఎం.కృష్ణ, విరుపాక్షి, భారత్, వీరేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

నందవరంలో వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఆస్పరిలో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ఆదోని ప్రజా బ్లడ్ బ్యాంకులో

అన్ని రకాల బ్లడ్ గ్రూపు నిల్వలు

- ఆదోని ప్రజా బ్లడ్ బ్యాంకు బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ జగన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ఆధునిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న టెక్నీషియన్ పర్యవేక్షణలో అన్ని రకాల బ్లడ్ గ్రూపులు నిల్వ ఉంచి, తక్షణమే సరఫరా చేస్తున్నట్లు ఆదోని ప్రజా బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ జగన్ వివరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోనిలోని మున్సిపల్ హై స్కూల్ గేట్‌కు ఎదురుగా మూడేళ్ల క్రితం బ్లడ్ బ్యాంకును స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి అన్ని రకాల బ్లడ్ గ్రూపులను నిల్వలు ఉంచి, అత్యవసర పరిస్థితుల్లో కూడా రక్తం సరఫరా చేస్తూ సేవలు అందిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. తమ బ్లడ్ బ్యాంకులో హోల్ బ్లడ్, ప్యాక్‌డ్ సెల్, సెలూన్ వాష్డ్, బ్లడ్ సెల్, ఫ్రెష్ ఫ్రోజెన్ ఫ్లాస్మా (ఎఫ్ఎఫ్‌పి), ప్లేట్‌లెట్ రిబ్ ప్లాస్మా (పిఆర్‌పి), సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్ (ఎస్‌డిపి) రకాల బ్లడ్ అందుబాటులో ఉందన్నారు. బ్లడ్ అవసరమైన వారు గతంలో బళ్లారి, కర్నూలు వెళ్లేవారని తెలిపారు. ఆ పరిస్థితి రాకుండా అన్ని సౌకర్యాలు, ఆధునిక సాంకేతిక పరమైన మిషనరీలు, ఫ్రిజ్‌లు అందుబాటులో ఉంచి నాణ్యమైన బ్లడ్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. రక్తదానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఇప్పటికీ కొందరిలో అపోహలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల పొందే ఆరోగ్యకరమైన ప్రయోజనాల గురించి కళాశాలలు, ఇతర సంస్థల కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గర్భిణీ, తలసేమియా, బాలింత, ప్రమాద బాధితులకు, అత్యవసర కేసులకు ఎప్పటికప్పుడు రక్తం అందిస్తున్నామని చెప్పారు. శబరి సేవా సమితి సౌజన్యంతో కర్నూలు, నంద్యాల, గద్వాల, తదితర ప్రాంతాల్లో బ్లడ్ బ్యాంకులు నెలకొల్పి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్లడ్ కావాల్సిన వారు ఆదోని ప్రజా బ్లడ్ బ్యాంకు నెంబర్ 08512 222555, సెల్ నెంబర్ 83310 22255కు సంప్రదించాలని కోరారు.

వైభవంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

కర్నూలు జిల్లా క్రీడాకారులతో ఎమ్మెల్యే

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి నుంచి మూడు రోజులపాటు ఫ్లడ్ లైట్ల వెలుతురులో రోజూ రాత్రి 6 గంటల నుంచి నిర్వహించే కీర్తిశేషులు మేకల రంగస్వామి స్మారక రాష్ట్రస్థాయి 70వ మహిళా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారిణులు రంగురంగుల దుస్తులు ధరించి జెండాలు చేత పట్టి ఉన్నత పాఠశాల నుంచి వైఎస్ఆర్ సర్కిల్, బస్టాండ్, సంత మార్కెట్ మీదుగా ర్యాలీ నిర్వహించి తిరిగి క్రీడా మైదానానికి చేరుకున్నారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఎంపిపి నసురుద్దీన్, తహశీల్దార్ వేణుగోపాల్ హాజరయి జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడాకారిణులు తమతమ జిల్లాల ప్లకార్డులు, గోనెగండ్ల కస్తూరిబా గాంధీ పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు జాతీయ జెండాలు చేత పట్టి ప్రత్యేకంగా చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. మొదటిసారి రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు గోనెగండ్లలో నిర్వహిస్తున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు కుబేర నాయుడు, జాకీర్ హుస్సేన్‌లు మైదానాన్ని అందంగా అలంకరించారు. ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేసి మ్యాట్లు వేశారు. పోటీలను తిలకించడానికి గ్రామస్తులతో పాటు మహిళలు, చిన్నారులు వచ్చారు. మొదటి రోజు కడప, ప్రకాశం జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టు, అనంతపురంపై గుంటూరు, నెల్లూరుపై చిత్తూరు జట్లు గెలుపొందాయి. కర్నూలు, తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు 30 పాయింట్ల తేడాతో గెలిచింది. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎలమంచిలి శ్రీకాంత్, రాష్ట్ర ట్రెజరర్ సుబ్బరాజు, రెఫరీ బోర్డు ఛైర్మన్ పి.రవీంద్రబాబు, వైసిపి నాయకులు టి.బందే నవాజ్, ఎస్‌బి.మన్సూర్, భాస్కర్ రెడ్డి, నిర్వాహకులు మేకల రఘునాయుడు, రంగరాజు నాయుడు, దేవేంద్ర, ఇస్మాయిల్, శివ, జి.షేక్షావలీ, రంగముని పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : పిడిఎస్ఒ

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని మహాత్మీ ఫంక్షన్ హాలులో నాయకులు ఖాదర్ అధ్యక్షతన పిడిఎస్ఒ డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల 4200 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5వ తరగతులను దగ్గరలోని హైస్కూల్లో విలీనం చేశారని తెలిపారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారని సాకు చూపి రాష్ట్రంలోని సుమారు 18 వేల పాఠశాలలను మూసేశారని చెప్పారు. 12,386 పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 18,520 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా న్నాయని తెలిపారు. పిడిఎస్ఒ రాష్ట్ర నాయకులు కె.తిరుమలేష్ మాట్లాడుతూ... దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ నిరుద్యోగులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అంతకుముందు ఆదోనిలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల రోడ్డు వరకు 500 మంది విద్యార్థులతో ప్రదర్శన చేపట్టారు. డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, శివ, ఉపాధ్యక్షులు వీర ప్రతాప్, సహాయ కార్యదర్శి నికిత, కోశాధికారి శ్రావణి, కమిటీ సభ్యులు సాయి, హరీష్, ఆది, ఈశ్వర్, శ్యామ్, వీరేంద్ర, ఇమ్రాన్‌ను ఎన్నుకున్నారు. ప్రజా కళారూపాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. పిడిఎస్ఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.ఆష, డివిజన్ అధ్యక్షులు టి.ఖాదర్ బాష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కస్వామి పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

- విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

వికలాంగుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న 'వికలాంగుల హక్కుల పోరుబాట యాత్ర'ను జయప్రదం చేయాలని విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బీసీ.నాగరాజు కోరారు. మంత్రాలయం చేరుకున్న వికలాంగుల పోరుబాటపై ఆయన మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలకు పింఛను పెంచాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, వికలాంగుల 4 శాతం పర్సెంట్ రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. డిసెంబర్ 8 నుంచి 11 వరకు 100 కిలోమీటర్ల 'వికలాంగుల హక్కుల పోరుబాట యాత్ర'ను చేపడుతున్నట్లు తెలిపారు. పోరుబాట కరపత్రాలు, గోడపత్రికలను పంపిణీ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రవి, పి.హనుమంతు, మంత్రాలయం కన్వీనర్ ఎం.సుధాకర్, ప్రతాప్, భీమేష్, కోసిగి మండల అధ్యక్షులు తాయన్న, కౌతాళం కన్వీనర్ ఈరన్న, నాగరాజు, హాల్వి కన్వీనర్ స్వామి, పెద్దకడబూరు కన్వీనర్ రామన్న, లింగన్న పాల్గొన్నారు.

ఓటరు జాబితా అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు ఓటరు జాబితా అవకతవకలపై కలెక్టర్ డాక్టర్ సృజనకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఫిర్యాదు చేశారు. బుధవారం టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిలతో కలిసి కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో అవకతవకలపై విచారణ చేపట్టి, తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023 5
నంద్యాల

జిల్లా కలెక్టర్‌తో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి

పనులు కాకుండానే ప్రారంభాలా..?

అవుకు టన్నెల్

నంద్యాల జిల్లాలోని అవుకు రెండో టన్నెల్ పనులు పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించేందుకు నేడు గురువారం సిద్ధమయ్యారు. వాస్తవానికి సొరంగాల పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. వెయ్యి మీటర్ల మేర లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రారంభించామని చెప్పుకోవడానికే ప్రారంభం చేసేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- అవుకు రెండో టన్నెల్‌ను నేడు ప్రారంభించనున్న సిఎం
- వ్యక్తమవుతున్న విమర్శలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కృష్ణా జలాలను కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు తరలించేందుకు గత ప్రభుత్వాలు గాలేరు-నగరి సుజల స్రవంతి (జిఎన్‌ఎస్‌ఎస్) ప్రాజెక్టును చేపట్టాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 30 టిఎంసిల వరద జలాలను గోరుకల్లు రిజర్వాయరుకు, అక్కడి నుంచి అవుకు రిజర్వాయరుకు తరలించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి కడప, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లోని 2.6 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాలకు తాగునీరు అందిచాలన్నది అవుకు టన్నెల్ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ క్రమంలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయరుకు 20 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు 57.7 కిలో మీటర్ల మేర కాలువను నిర్మించాలని భావించారు. అయితే గోరుకల్లు నుంచి నీరు అవుకు రిజర్వాయర్లోకి వెళ్లేందుకు మధ్యలో భారీ కొండ అడ్డుగా మారింది. దీంతో 6 కిలోమీటర్ల మేర కొండను తొలచి సొరంగ మార్గం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీనికి గత ప్రభుత్వాలు ప్యాకేజీ-30 కింద పనులు చేపట్టాయి. అయితే పనులు కొలిక్కి రాలేదు. ఆ తర్వాత 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత సొరంగ మార్గంలో ఫాల్ట్ జోన్లు(మట్టి పొరలు బలహీనంగా ఉండి పై నుంచి మట్టి పెళ్లలు ఊడి పడుతున్న ప్రాంతం) ఏర్పడ్డాయి. కుడి సొరంగంలో 350 మీటర్లు, ఎడమ సొరంగంలో 160 మీటర్ల ఫాల్ట్ జోన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫాల్ట్ జోన్ కారణంగా టన్నెల్ పనులు ముందుకు సాగలేదు. దీంతో అప్పటి సిఎం చంద్రబాబు నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించారు. ఆ నివేదిక ప్రకారం కుడి సొరంగంలోని ఫాల్ట్ జోన్ ప్రాంతం నుంచి రెండు బైపాస్ సొరంగాలు తవ్వి, మట్టి పెళ్లలు ఊడిపోకుండా గడ్డర్లను ఏర్పాటు చేశారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటికి అవుకు టన్నెల్ పనుల్లో ఎడమ సొరంగం ఫాల్ట్‌జోన్ పనులు, లైనింగ్ పనులు మిగిలి ఉన్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సంవత్సరం లోపు ఈ టన్నెల్ పనులు పూర్తి చేస్తామని జగన్ చెప్పారు. అయితే రివర్స్ టెండరింగ్ పేరిట అప్పటికే పనులు చేస్తున్న కంపెనీని తప్పించి తమకు అనుకూలమైన కంపెనీకి కట్టబెట్టారు. రూ.108 కోట్లతో పనులు చేజిక్కించుకున్న సంస్థ పనులు చేట్టింది. ప్రభుత్వం బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో పనులు నెమ్మదించాయి. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన టన్నెల్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కుడి సొరంగంలోని నాన్ ఫాల్ట్ జోన్‌లో 200 మీటర్ల లైనింగ్ పనులు, ఆర్చి పనులు, ఎడమ సొరంగంలోని నాన్ ఫాల్ట్ జోన్‌లో 800 మీటర్లు లైనింగ్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. మరో వైపు కాంట్రాక్టర్లకు రూ.3 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు సుముఖత చూపడం లేదని సమాచారం. పనులు పెండింగ్‌లో ఉండగానే టన్నెల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభి స్తుండటంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్‌ఆర్‌బిసి ఆయకట్టుకు అన్యాయం

ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. ప్రాజెక్టుల్లోకి కూడా నీరు సరిగా చేరలేదు. ముఖ్యంగా ఎస్‌ఆర్‌బిసి కింద లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండటంతో గోరుకల్లు రిజర్వాయర్ మీదే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం అవుకు టన్నెల్‌ను సిఎం ప్రారంభిస్తున్న సందర్భంగా దాదాపు రెండు టిఎంసిల నీటిని గోరుకల్లు నుంచి అవుకుకు తరలించేందుకు సిద్ధమయ్యారు. 12.4 టిఎంసిల సామర్థ్యం ఉన్న గోరుకల్లులో ప్రస్తుతం 8 టిఎంసిల నీళ్లే ఉన్నాయి. ఉన్న నీటిలో 2 టిఎంసిలు తరలిస్తే ఎస్‌ఆర్‌బిసి ఆయకట్టుకు అన్యాయం చేసినట్లు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారుల అనాలోచిత నిర్ణయంతో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారం కోసమే..

ఎప్పుడో పూర్తి కావాల్సిన టన్నెల్ పనులు నిధులు ఇవ్వకపోవడం వల్ల ఆలస్యం అయ్యాయి. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని ప్రచారం కోసం పనులు పూర్తి కాకుండానే టన్నెల్‌ను ప్రారంభి స్తున్నారు. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్‌లో నీళ్ల లేక ఎస్‌ఆర్‌బిసి ఆయకట్టు కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. నీళ్ల ఉన్నప్పుడు తీసుకెళ్తే ఎవరికీ ఇబ్బంది లేదు. నీళ్ల లేనప్పుడు ప్రచారం కోసం నీటిని తరలించాలని చూడడం మంచిది కాదు.

- టి.రమేష్ కుమార్, సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి.

‘ఆడుదాం-ఆంధ్రా’ను జయప్రదం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారులైన విద్యార్థినీ విద్యార్థులు పేర్లు నమోదు చేసుకొని పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి కోరారు. బుధవారం పిఎస్‌సి, కేవీఎస్‌సి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో క్రీడలలో ఆసక్తి ఉన్న విద్యార్థి విద్యార్థినిలతో మున్సిపల్ కమిషనర్ పేర్లను రిజిష్టర్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్, మెప్మా సిఎంఎమ్, వార్డు మహిళా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల** : ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో ఉత్సాహవంతులైన యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపిడిఓ సాయికృష్ణ కోరారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల పైబడిన యువతి యువకులు స్థానిక సచివాలయాల్లో, 1902కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 15 నుండి జరగనున్న క్రీడల్లో రాణించాలన్నారు.

క్రీడాకారుల పేర్లను నమోదు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రా రెడ్డి

నేడు సిఎం జగన్‌మోహన్ రెడ్డి పర్యటన

- అప్పగించిన విధులు సక్రమంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్
- పోలీసుల ఆధీనంలో టన్నెల్ పరిసర ప్రాంతాలు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని మెట్టుపల్లె, రామవరం గ్రామాల సమీపాన ఉన్న టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులకు అప్ప గించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా ఎస్పీ రఘు వీర్ రెడ్డిలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బందోబస్తు నిమిత్తం వచ్చిన సిబ్బందిని ఆరు బృందాలుగా విభజించి ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలని, విధుల పట్ల అలసత్వం వహించరాదని హెచ్చరించారు. హెలిప్యాడ్, టన్నెల్-1, 2, కొండ ప్రాంతాలు, వివిఐపిలు ఉండే స్థలం, వారు వెళ్లే మార్గాలు యాక్సెస్ కంట్రోల్ వారు పకడ్బందీ చర్యలు తీసుకుని పని చేయాలని సూచించారు. అనంతరం బాంబు స్క్వాడ్ సిబ్బంది అణువణువు ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిఎం రాక సందర్భంగా బందోబస్తుకు ఇద్దరూ డిఎస్‌పిలు, 10 మంది సిఐలు, 26 మంది ఎస్ఐలు 108 మంది ఏఎస్ఐలు, 117 మంది హెడ్ కానిస్టేబుల్స్, 60 మంది మహిళా పోలీసులు, ఇద్దరు ఏఆర్ పోలీసులు, రెండు స్పెషల్ పార్టీ పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, మ్యాక్స్ ఇన్ఫ్రా మేనేజర్ శ్రీహరి పాల్గొన్నారు.

నంద్యాల టిడిపిలో అసంతృప్తి సెగలు

- ఫరూక్‌ను ఇంఛార్జిగా నియమించడంపై జీర్ణించుకోలేని భూమా అనుచరులు
- భూమాను తప్పించడం వెనక కుటుంబ కోల్డ్ వార్..?

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల టిడిపిలో అసంతృప్తి సెగలు రాజుకున్నాయి. మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు నంద్యాల నియోజకవర్గ ఇంఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ టిడిపి అధిష్ఠానం నిర్ణయం తీసు కోవడంతో భూమా గ్రూపు భగ్గుమంటోంది. భూమాకు కాకుండా ఫరూక్‌ను ఇంఛార్జిగా నియమించడం వెనుక పెద్ద వ్యూహమే ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు...

నంద్యాల నియోజకవర్గ టిడిపి ఇంఛార్జిగా మాజీ ఎన్ఎండి ఫరూక్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీనిపై భూమా గ్రూప్ నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. భూమా నాగిరెడ్డి మరణానంతరం 2017లో నంద్యాల నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అప్పటి మంత్రిగా ఉన్న భూమా అఖిల ప్రియ తన అన్న బ్రహ్మానందరెడ్డిని తెర పైకి తెచ్చి ఉప ఎన్నికలో నిలబెట్టి పార్టీ యావత్ సర్వ శక్తులు ఒడ్డి ఆ ఎన్నికలో 25 వేల మెజార్టీతో బ్రహ్మానందరెడ్డిని గెలిపించుకున్నారు. సంగతి తెలిసిందే. అయితే ఆ తరువాత జరిగిన పరిణామల నేపథ్యంలో భూమా అఖిల ప్రియ తన సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిని నంద్యాల నియోజకవర్గంలో పోటీలో నిలబెట్టాలని నంద్యాల జిల్లా కేంద్రంగా కార్యకలాపాలు జరపడం వంటివి భూమా కుటుంబంలో కోల్డ్ వార్ ప్రారంభమైంది. ఈ కోల్డ్ వార్‌తోనే భూమా బ్రహ్మానందరెడ్డిని ఇంఛార్జి పదవి నుండి తొలగించారని చర్చ జరుగుతుండగా మరోవైపు బనగానపల్లెకు చెందిన ఓ నేత భూమా బ్రహ్మానందరెడ్డిని నంద్యాల నియోజకవర్గం నుండి తప్పించేందుకు గత నాలుగేళ్లగా తీవ్ర ప్రయత్నం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు నాయుడు రాయలసీమ జిల్లాల్లో ఏదో ఒక ప్రాంతం మైనార్టీలకు కేటాయించాలన్న ఆలోచనలో భాగంగానే నంద్యాల నియోజక వర్గంను మైనార్టీలకు కేటాయించారనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తం అవుతోంది. అందులో భాగంగానే నంద్యాల నియోజకవర్గ ఇంఛార్జిగా ఫరూక్‌ను నియమించడంతో బ్రహ్మానందరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తనకు కాదని ఇతరులకు సీటు ఇస్తే తాను స్వతంత్ర అభ్యర్థిగా నైనా పోటీ చేస్తానని అధిషానానికి సాంకేతాలు పంపినట్లు సమాచారం. ఏకంగా భూమా అనుచరులు తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, రాయలసీమ ఇంఛార్జి అమరనాథ్ రెడ్డి ఫోన్ ద్వారా బ్రహ్మానందరెడ్డితో మాట్లాడి రాజీనామాల నిర్ణయాన్ని విరమింప జేశారు. గత రెండు రోజులుగా భూమా బ్రహ్మ నందరెడ్డి హైదరాబాద్‌లో మకాం వేశారు. భూమాకు న్యాయం జరిగేలా అధిష్టానం నిర్ణయం ఉంటుం దని తెలిపినట్లు భూమా అనుచరులు చెబు తున్నారు. బ్రహ్మానందరెడ్డికి న్యాయం జరగకపోతే సహించేది లేదని బహి రంగంగానే హెచ్చరిస్తున్నారు. మరో వైపు ఫరూక్‌ను నంద్యాల నియోజకవర్గ ఇంఛార్జిగా నియమించడంతో ఫరూక్ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జోష్‌లో ఉన్నారు. ఫరూక్‌కు బాధ్యతలు ఇవ్వడంతో నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పార్టీ బలోపేతం అవుతుందనే అభిప్రాయాన్ని ఫరూక్ అనుచరులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా భూమా బ్రహ్మానందరెడ్డి త్వరలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే నంద్యాల, గోస్పాడు మండలాలకు చెందిన ప్రధాన నాయకులతో వేరు వేరుగా సమావేశాలు జరిపి అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలిసింది. మరి భూమా గ్రూపును ఫరూక్ కలుపుకొని పోతారా లేక వదిలేస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

‘నలంద’ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల : విద్యార్థులను కొట్టి, గుండు గీయించి, ఒక విద్యార్థికి చెయ్యి విరగ్గొట్టిన నలంద జూనియర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.శివ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేరులతో మాట్లాడారు. నూనెపల్లె ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లో ఉన్న నలంద జూనియర్ కళాశాలలో విద్యార్థులను కొట్టి, గుండు గీయించే హక్కు యాజమాన్యానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ కళాశాల నడుస్తుందని అన్నారు. విద్యార్థులకు సరిపడా విశాలమైన తరగతులు లేవన్నారు. కళాశాలలో హాస్టల్లో నిర్వహించడానికి అనుమతులు ఎక్కడున్నా యని ప్రశ్నించారు. కళాశాలలో విద్యార్థులకు జరిగిన గొడవలను అడ్డం పెట్టుకొని యాజమాన్యం విద్యార్థులను ఇష్టానుసారంగా విద్యార్థులను కొట్టి తీవ్ర గాయాలకు గురిచేయడం దారుణ మన్నారు. తక్షణమే ఆర్ఐఒ, ఇంటర్మీడియట్ ఆఫీసర్‌లు యాజమాన్యంపై చర్యలు తీసుకొని కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంజయ్, శ్రీను, విశ్వనాథ్, అంజి పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి భక్తులకు వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దాదాపు 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి సుబ్బారెడ్డి, పిసి పుల్లయ్య, యోగి, వేణుగోపాల్ రెడ్డి, మారుతి మురళి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న కాటసాని ప్రసాద్ రెడ్డి

స్మశాన వాటిక కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ఏబీ ఎం పాలెం, మారుతి నగర్, శేష శయనా రెడ్డి నగర్ తదితర కాలనీల ప్రజలకు ఉన్న స్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక భరత్ కాంప్లెక్స్ నుండి ర్యాలీగా పాతబస్టాండ్ మీదుగా స్థానిక జైకిసాన్ పార్కులో జరుగుతున్న మున్సిపల్ కౌన్సిల్ బాడీ సమావేశం వద్దకు చేరుకున్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీ ఎం పాలెం, మారుతి నగర్, శేష శయనా రెడ్డి నగర్ తదితర కాలనీలలో 10 వేల కుటుంబాలు ఉన్నాయని, సర్వే 176/ఎలో దాదాపు మూడు ఎకరాల భూమిని స్మశాన వాటికగా వినియోగిస్తున్నారని చెప్పారు. పట్టణంలోని దళితులు 100 సంవత్సరాల నుండి వినియోగిస్తున్న స్మశాన వాటికను కొంతమంది బేడ, బుడగ జంగాల కులస్తులకు 50 సెంట్లు భూమిని 2 లక్షల 80 వేల రూపాయలకు విక్రయించారన్నారు. స్మశాన వాటికలో ఉన్న సమాధులను తొలగించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడు లేడన్నారు. ఈ విషయాన్ని స్థానిక తాసిల్దార్, కమిషనర్, సిఐల దృష్టికి తీసుకుపోయినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని చెప్పారు. కాలనీలో పార్కు కోసం కేటాయించిన స్థలంలో కళ్యాణ మండపం నిర్మించాలని కోరారు. దళితులకు చెందిన స్మశాన వాటికను వారికి కేటాయించాలని లేని పక్షంలో దళితుల సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో ఆమరణ దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే భాస్కర్ రెడ్డి, పి పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, సి నాగన్న, స్థానికులు జాన్, వెంకటేశ్వర్లు, విజయుడు, పెద్ద జములయ్య, మధు, సురేష్, మంగమ్మ, లచ్చుమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అవుకు టన్నెల్‌ను ప్రారంభించే అర్హత సిఎంకు లేదు : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

మూడు కోట్ల పనులను నాలుగున్నర సంవత్సరాలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అవుకు టన్నెల్‌ను ప్రారంభించే అర్హత లేదని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ. 400 కోట్లతో తెలుగుదేశం పాలనలో పనులు చేస్తే రూ. 3 కోట్ల మిగిలిపోయిన పనులను వైసిపి పాలనలో నాలుగున్నర సంవత్సరాలకు పూర్తి చేశారని, అవుకు టన్నెల్‌ను ప్రారంభించే అర్హత సిఎంకు లేదన్నారు. కమీషన్‌లకు పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సొమ్మొకడిది సోకడిది అన్నట్టు గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలకు నేడు సిఎం ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రచార ఆర్భాటం కోసమే అవుకు టన్నెల్‌ను సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తున్నారని తెలిపారు. రెండవ టన్నెల్‌లో లైనింగ్ పనులు పూర్తికాకుండానే ప్రారంభిస్తుండడం జగన్‌కే సాధ్యమన్నారు. పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గం వర్గాల రైతులు నీళ్ల లేక అల్లాడుతుంటే అక్రమంగా జిఎన్‌ఎస్‌ఎస్ ద్వారా కడప జిల్లాకు నీటిని తరలిస్తుంటే ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డిలు నోరు మెదకపోవడం దారుణమన్నారు. జిఎన్‌ఎస్‌ఎస్ కాల్వ కింద లైనింగ్ వేయడంతో భూగర్భ జలాలు పెరిగే పరిస్థితి లేదన్నారు. జుర్రేరు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం నీరును వదలకపోవడంతో దద్దనాల ప్రాజెక్టు కింద రైతులు భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు ఆడక పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నీళ్ల వదలకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాత్రేడ్డి మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ఇక నుండి జిల్లా కేంద్రం నుండే కార్యక్రమాలు : మాండ్ర

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇకనుండి నంద్యాల జిల్లా కేంద్రం నుండి పార్లమెంటు నియోజకవర్గ కార్యకలాపాలు జరుగుతాయని టిడిపి పార్లమెంటు ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్‌తో పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితిపై చర్చించారు. అనంతరం నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం కార్యాలయంకు కావాల్సిన భవనాన్ని పరిశీలించారు. త్వరలో జిల్లా కేంద్రంలో పార్టీ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అయనతో పాటు నందికొట్కూరు నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

టిడిపి జిల్లా కార్యాలయాన్ని సందర్శించిన మాండ్ర శివానందరెడ్డి

పిఎస్‌లో సిఐటియు నాయకుడు లక్ష్మణ్

సిఐటియు నాయకుడు లక్ష్మణ్ అరెస్టు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేడు జిల్లాలో సిఎం పర్యటన సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్‌ను నంద్యాల టు టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అవుకు టన్నెల్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా సిఐటియు నాయకులు అక్కడికి వెళ్లకుండా అరెస్టు చేసిన స్టేషన్‌కు తరలించారు.

నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని వినియోగించుకోవాలి : సబ్ రిజిస్టర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 ప్రైమ్ నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సబ్ రిజిస్టర్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ పరిధిలో 12 గ్రామాలలో రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి, అహోబిలం, బాచేపల్లి, పాత కందుకూరు, మిట్టపల్లి, చిన్న వంగలి, డి. వనిపెంట, ముత్యాలపాడు, మల్లవేముల, పెద్ద వంగలి, మందలూరు, ఆర్.నాగులవరం గ్రామాల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రజలు ఆయా పంచాయతీ కార్యదర్శుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కల్పించారన్నారు. ప్రజలు వ్యయ ప్రయాసాలకోర్చి ఆళ్లగడ్డ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం రావాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం ఈ స్టాంపింగ్ వ్యవస్థను తెచ్చిందన్నారు. ఆళ్లగడ్డ పరిధిలో 9 మంది స్టాంపు వెండర్లకు అనుమతులు మంజూరు చేశామన్నారు. ప్రజలు ఆయా గ్రామాలకు దగ్గరలో ఉన్న ఈ స్టాంపు అమ్మకందారుల వద్దకు వెళ్లి కొనుగోలు చేసుకుని దస్తావేజులు సిద్ధం చేసుకుని ఆయా పంచాయతీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. చలానా ఆన్లైన్లో కట్టుకోవచ్చన్నారు.

మాట్లాడుతున్న అబ్దుల్ సత్తార్

రుద్రవరం ఎస్ఐగా నిరంజన్ రెడ్డి బాధ్యతలు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం ఎస్ఐగా నిరంజన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శరత్ కుమార్ రెడ్డిని ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎమ్మిగనూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నిరంజన్ రెడ్డిని రుద్రవరం ఎస్సైగా నియమిస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

'మానవతా' ఆధ్వర్యంలో సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో తహశీల్దారు, గ్రంథాలయం, ఉన్నత పాఠశాల మైదానం, బస్టాండ్ తదితర ప్రాంతాలలో 47 సిమెంట్ బల్లలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కరుణాకర్ రెడ్డి, వాసు దేవ రెడ్డి, విజయ రావు, కృష్ణారెడ్డి, బాలయ్య, చాంద్ బాష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గడివేముల: గడివేముల మండలంలోని బూజునూరు-గ్రంధివేముల గ్రామాల మధ్య పెట్రోల్ బంక్ సమీపాన గడివేముల చెందిన కూరగాయల ఆటో జిందాల్ లారీని ఢీ బుధవారం కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న అబ్దుల్ రజాక్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడు అజ్మతుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. అజ్మతుల్లాకు ఐదు నెలల క్రితమే కర్నూల్ పట్టణానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. తీవ్ర గాయాలైన అజ్మతుల్లాను 108లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అబ్దుల్ రజాక్‌కు భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే వారు. లారీని రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలబెట్టడంతోనే తన భర్త మృతి చెందాడని అబ్దుల్ రజాక్ భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్ఐ ఎన్‌వి రమణకు సన్మానం

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఎస్సై ఎన్వీ రమణను నందికొట్కూరు పాత్రికేయులు, కుల సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి శాంతి భద్రతల పరిరక్షణలో ఎనలేని సేవలందించారన్నారు. పాత్రికేయులు జయరాజు, పగడం గోపి, ఆంజనేయులు, పరమేష్, సుధాకర్, రహిమ్మతుల్లా, స్వామన్న, ఉసేనాలం, వాడాల శేషు, ఆనంద్, షైక్ అబ్దుల్లా, ఉమర్, కుల సంఘాల నాయకులు జాన్, నాగసురేష్, జాలంగారి నాగన్న, మాజీ ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలందరూ కంటి సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్యులు షేక్షావలి తెలిపారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని గోకవరం ప్రభుత్వ వైద్యశాల పరిధిలో ఉన్న గోకవరం, ఎదురుపాడు, శివపురం గ్రామాల్లో ఉన్న 13 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం శాంతిరాం ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయేంద్ర ప్రసాద్, దీపా నాగవేణి, జుబేర్, సిహెచ్ఓ బాలకృష్ణయ్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ షేక్షావలి

జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం : మాజీ ఎమ్మెల్యే

పాణ్యం : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి - పాణ్యం

జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడి పోయిందని, రాష్ట్ర పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, అభివృద్ధి శూన్యమని టిడిపి పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం పాణ్యంలో భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, టిడిపి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఎపి మళ్ళీ అభివృద్ధి బాట పట్టాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. పాణ్యం టిడిపికి కంచుకోట అని, వచ్చే ఎన్నికల్లో కూడా టిడిపికి మెజారిటీ ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయరామి రెడ్డి, లాయర్ బాబు, రంగ రమేష్, రమణ మూర్తి, ఇప్ప సుధాకర్, ఖాదర్, జయసింహ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గుజ్జుల సుబ్బయ్య పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలో భవిష్యత్తు కు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి టిడిపి ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను మాజీ మంత్రి పంపిణీ చేశారు. టిడిపి సీనియర్ నాయకులు రఘురామిరెడ్డి, గోపిరెడ్డి శివారెడ్డి, మర్రి పల్లె పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అవుకును అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం అవుకు పట్టణంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని ముస్లిం వీధిలో ఇంటింటికి తిరుగుతూ టిడిపి అధికారంలోకి వస్తే చేయబోయే పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా అవుకులో అభివృద్ధి జాడే కనపడలేదన్నారు. పట్టణంలోని ఎస్ఆర్‌బిసిలో ఇచ్చే ఇళ్ల పట్టాలు, డీకేటి పట్టాలు, రైతులకు ఇచ్చే భూములు కూడా సారవంతమైనవి కావని, రైతులను, ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు భవిష్యత్తు పథకాలు అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటరమణ నాయక్, తిక్కన్న, అవుకు మండల క్లస్టర్ ఇంచార్జ్ అరుణ్ కుమార్ నాయక్, యూనిట్ ఇంచార్జ్ దంతల రమణ, తెలుగు యువత అధికార ప్రతినిధి ఎస్.వెంకట రాముడు నాయక్, జయ శివుడు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనకు విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు టిడిపి పాలన కోసం ఎదురు చూస్తున్నారని టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, సల్లా ధనుంజయుడులు తెలిపారు. చాగలమర్రిలోని శివాలయం వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. మోహన్ క్రిష్ణ, ఫకృద్దీన్, అబ్దుల్లా, నరేంద్ర, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని కొండపేటలోని 105 బూత్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు బొబ్బల మద్దిలేటిరెడ్డి, నుసి విష్ణువర్ధన్ రెడ్డిలు ఇంటింటికి తిరిగి ప్రజలకు టీడీపీ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే 96వ బూత్‌లోని ఈద్గా నగర్‌లో టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు వెల్డింగ్ జాకీర్ ఇంటింటికి తిరిగి వివరించారు.

ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిలప్రియ

అవుకు : కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి

వాడి వేడీగా కౌన్సిల్ సమావేశం

- సమస్యలపై నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ మున్సిపాలిటీ అత్యవసర సమావేశం బుధవారం వాడి వేడిగా సాగింది. కౌన్సిలర్లు పలు సమస్యలను లేవనెత్తి ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశం చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మొత్తం ఏడు అజెండా అంశాలపై చర్చకు అధికారులు ప్రవేశపెట్టారు. ముందుగా కౌన్సిలర్ సుల్తాన్ మాట్లాడుతూ తన వార్డులో గత రెండు సంవత్సరాల నుండి సిమెంట్ రోడ్డు వేయాలని కోరుతున్నప్పటికీ ఒక్కటి కూడా మంజూరు చేయడం లేదన్నారు. వార్డు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. నిధుల విషయాలను ప్రశ్నించినప్పుడు ఎస్ఎస్సి నిధులు లేవంటారని, సమావేశంలో అజెండాలో మాత్రం ఆ నిధుల ద్వారా ఖర్చు చేస్తున్నామంటారని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. మరికొందరు కౌన్సిలర్లు పార్వతి, లక్ష్మమ్మ, మారుపోతుల విజయ్‌లు మాట్లాడుతూ తమ వార్డులలో సమస్యలు పేరుకుపోతున్నాయని, నీటి సమస్య ఉందని, పరిష్కరించే దిశగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ ఆసియా జోక్యం చేసుకుంటూ కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై అధికారులు ఆయా వార్డులకు వెళ్లి పరిశీలించాలని సూచించారు. అనంతరం ఏడు అజెండా అంశాలపై సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాసరావు. కౌన్సిలర్ విజయ్ చౌదరి. కో ఆప్షన్ సభ్యుడు ఎం ఏ రషీద్. కౌన్సిలర్ రంగస్వామి ప్రకాష్ రావు . వైస్ చైర్మన్ పువ్వాడి దివ్య. సుగుణమ్మ. తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

చెంచు గిరిజన కుటుంబాలను ఆదుకోవాలి

- కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంఘం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

చెంచు గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు వై.ఆశీర్వాదం, కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం డిఎఫ్ఓ విగ్నేష్ అపోవ్‌ను వారు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోర్నాల మండలం పెద్దారుట్ల చెంచు గిరిజన గూడెంలో దాదాపు 70 సంవత్సరాలు నుంచి 25 కుటుంబాల వారు జీవిస్తున్నారని, వారికి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గుర్రపు సాల బీట్ రేంజ్ పరిధిలో దాదాపు 50 ఎకరాల అడవి బంజరు భూమి ఉందని, కుటుంబానికి 5 ఎకరాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

స్పందించిన డిఎఫ్ఓ చెంచు గిరిజన కుటుంబాలను ఆదుకుంటామని, త్వరలో భూమిని ఇచ్చేవిధంగా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు కన్నా, గంగయ్య, భ్రమరాంబ, లక్ష్మీదేవి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పది అంశాలకు ఏకగ్రీవ ఆమోదం : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 10 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ముఖ్యంగా పాతబడిన కరెంటు పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయుటకు ఆమోదించినట్లు చెప్పారు. ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు కొత్త బస్టాండ్ వెనకాల క్రికెట్ ప్రాక్టీస్ కోసం నెట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు హరికిషన్, జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డిఈ రసూల్, ఏఈ సురేష్, శానిటేషన్, రెవిన్యూ, హౌసింగ్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- సిఐటియు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - గడివేముల : మండలంలోని గడిగరేవుల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ స్వాములు కుటుంబ సమస్యలు, అప్పుల బాధ తాళలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటి ముందర చల్లే సౌభాగ్య పేడరంగును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గడివేముల సిఐటియు ఆటో యూనియన్ కార్మికులు కలిసి 21,500 రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఆటో కార్మికులు లక్ష్మయ్య, కాంతారావు, రాజు, యూనియన్ కార్మికులు కుటుం సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి

- అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఎంఇఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి, మండల విద్యాధికారి అబ్దుల్ కలాం అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండలం పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. షాపులు, ఫ్యాక్టరీలను పరిశీలించారు. లేబర్ యాక్ట్ ప్రకారం 18 సంవత్సరాల లోపు అబ్బాయిలు, అమ్మాయిలు పనులు చేయడానికి వీలు లేదన్నారు. పనిచేస్తున్న బాలుడుకార్తిక్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి పాఠశాలలో చేరేలా చైతన్యం కల్పించారు. కార్తిక్ పాఠశాలకు వెళ్తానని చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్వప్నలత, సిఆర్పిలు మద్దిలేటి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

4, 5వ తేదీల్లో భారీ వర్ష సూచన

- పంట కోతలు ముగించుకోవాలి : జిల్లా వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : డిసెంబర్ 4, 5వ తేదీల్లో నంద్యాల జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపిందని, ఈ నేపథ్యంలో రైతాంగం వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటల కోతలను వెంటనే ముగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే కోసిన పంటలను వర్షం నుంచి కాపాడుకోవడానికి ధాన్యాన్ని గోడౌన్లలో భద్రపరుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కళ్లాల్లో ఆరబెట్టుకున్న పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు.

'పొలంబడి'పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - మహానంది : పొలంబడి ద్వారా తక్కువ ఖర్చుతో రైతులకు అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని నంద్యాల జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ సరళమ్మ అన్నారు. బుధవారం మహానంది బొల్లవరం గ్రామంలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి బి. నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి ద్వారా రైతులలో విశ్లేషణాత్మక శక్తి పెరిగి ఏదైనా సమస్య వచ్చినప్పుడు సొంతంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వరి పంటలో యాజమాన్య పద్ధతుల గురించి విరించారు. ఎఒ బి.నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ బొల్లవరం గ్రామంలో పొలంబడి శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. పొలంబడి ద్వారా మిత్ర పురుగులను రక్షించు కోవచ్చునని, ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏవోలు ప్రభావతమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్ మధు, కృష్ణకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అదనంగా 50 రోజుల పని

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచెర్ల మండలాన్ని కరువుగా గుర్తించినందుకు ఉపాధి కూలీలకు పనులు అదనంగా 50 రోజులు పని కల్పించనున్నట్లు ఇన్చార్జ్ ఎంపీడీవో దస్తగిరి బాబు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్‌లో ఎపిఒ శేషన్న ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా 2024-25కి మండలంలో వెయ్యి ఫారం పాండ్లు, 5 అమృత సరోవరు కుంటలు, 100 మినీ అమృత్ సరోవర్ కుంటలు, 300 ఎకరాలు పండ్ల తోటల పెంపకం తదితర పనులు గుర్తించాలని చెప్పారు. సమావేశంలో ఇసి సుబ్బా నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర్ నాయక్, శీను, కంప్యూటర్ ఆపరేటర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామంలో పల్లెకు వెళ్దాం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరై గ్రామానికి వచ్చిన ప్రభుత్వ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబు, ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ మాణిక్యమ్మ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ రామ సుబ్బయ్య, రుద్రవరం సర్పంచ్ రామస్వామి, చెలిమిల్ల సర్పంచ్ చంద్రారెడ్డి, మద్దూర్ ఎంపీటీసీ బషీర్ అహ్మద్, వైసీపీ మండల నాయకులు రమణారెడ్డి, భీమశంకర్, మాలిక్ భాష, బాలీశ్వర్ రెడ్డి, రాజన్న, స్వామిదాసు, భూమా రాములమ్మ, అధికారులు పాల్గొన్నారు. **డోన్ :** ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత వైఎస్ఆర్సిపి ప్రభుత్వానిదేనని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. డోన్ పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 2, 3, 4వ వార్డులలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకిర్ హుస్సేన్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ కురుకుందు హరి, కౌన్సిలర్ పూజారి వెంకటేశరమ్మ, బద్దల సుబ్బలక్ష్మి, రమణ, ధార హరి, నాయకులు వంశీ, బద్దల హరి, సచివాలయ కన్వీనర్ శ్రీను, వేణు, గృహ సారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** వైసిపి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని మందలూరు, ముత్తలూరు సచివాలయం పరిధిలోని నక్కలదిన్నె గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గ్రామ సర్పంచి నిర్మలమ్మ, ఎంపీటీసీ శంకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో మధుసూదనరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఏపి నీడ్స్ సీఎం జగన్ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రవి యాదవ్ పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంపిపి మురళీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి పబ్బతి జ్యోతి, రవి, జడ్పిటిసి కలిమునిస, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రావత్ జబ్బార్, వైస్ చైర్మన్ మొల్ల షరీఫ్, బ్రాహ్మణ కొట్కూర్, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, మద్దూర్ సతీష్ రెడ్డి, శివారెడ్డి, రవికుమార్ రెడ్డి, బ్రహ్మం రెడ్డి, సర్పంచి జనార్దన్ గౌడ్, ఉప సర్పంచ్ యేసు రత్నం, సుజిత్ రెడ్డి, అల్లంపూర్ రవీంద్రారెడ్డి,బైరెడ్డి శ్రీధర్ రెడ్డి, దానమయ్య, నాయకులు పాల్గొన్నారు. **మహానంది :** మండలం గోపవరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచి వి.సుదర్శనం అధ్యక్షతన జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఎంపిపి బుడ్డారెడ్డి యశస్విని పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టిక బోర్డును వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, పుల్లయ్య ఆవిష్కరించారు. జడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, మహానంది దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్, వైసిపి మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, ఏపీవో మనోహర్, ఎంపిటీసీ రాఘవేంద్ర, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మండలంలోని ముత్యాలపాడు 2వ సచివాలయంలో ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సచివాలయాల జెసిఎస్ అధ్యక్షుడు షేక్ బాబూలాల్, ఆ పార్టీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు సంక్షేమ పథకాల జాబితాను విడుదల చేశారు. వైసిపి జెండాను ఎగరవేశారు. ఎంపీడీవో మహబూబ్ దౌలా, తోడేండ్లపల్లి గ్రామ సర్పంచ్ గోవిందయ్య, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేషు రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు చాంద్ బాషా, రెహమాన్, రంగయ్య, అంకల్ రెడ్డి, నరసయ్య, గుర్రప్ప, అబ్దుల్లా పాల్గొన్నారు. **బండి ఆత్మకూరు :** మండలంలోని కడమలకల్వ గ్రామంలో సర్పంచ్ మేరీ పుష్పాంజలి అధ్యక్షతన జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమం, జగనన్న మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలంటే కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, రాగాల బాబులు, వైసిపి మండల కన్వీనర్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ముడివేల పుల్లారెడ్డి, వెంగల్‌రెడ్డి పేట సర్పంచ్ పల్లె నాగమణి, నాయకులు పల్లె సోమశేఖర్ రెడ్డి, పబ్బతి ఏసురత్నం, ఎంపీడీవో వాసుదేవగుప్త, ఈఓఆర్డి శ్రీనివాసులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని పెట్నికోట సచివాలయంలో జరిగిన ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి పాల్గొన్నారు. వైసిపి నాయకులతో కలసి జెండా ఎగరవేశారు. లబ్ధిదారుల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైసిపి నాయకులు పుల్లన్న, సుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** మండలంలోని మిట్టపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి పాల్గొని వైసిపి జెండా ఎగరవేశారు. సచివాలయ పరిధిలోని మొత్తం లబ్ధిదారులు పొందిన ఆర్థిక లబ్ది డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్, నాయకులు గంగుల రామిరెడ్డి, గూబగుండం వెంకటసుబ్బారెడ్డి, యాదవాడ సర్పంచ్ నరసింహ రెడ్డి, మండల ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, జెసిఎస్ మండల కన్వీనర్ రామకృష్ణ, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ గజ్జల రంగస్వామి రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్, ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పాల్గొని మాట్లాడారు. నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ బీరువలి నాగేశ్వర రెడ్డి, రంగాపురం మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి, రంగాపురం సర్పంచ్, గుమ్మగాళ్ల రాజు, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, ఎంపీటీసీలు వెంకట లక్ష్మమ్మ, నాగ శేషుడు, సచివాలయ కన్వీనర్లు శేఖర్ రెడ్డి, నీలి కృష్ణన్న, తిమోతి, పూజారి పుల్లయ్య, నాయకులు బావికాటి మోహన్ రెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆత్మకూర్ మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ సచివాలయ 13,14వార్డ్ పరిధిలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లక్ష్మి నగర్ సచివాలయం పరిధిలో 28 కోట్ల 16 లక్షల 52 వేల 437 రూపాయలు అర్హులైన పేదలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైసిపి అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, వైసిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, బాషా, కౌన్సిలర్ రంగస్వామి, గృహ సారథులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు మున్సిపాలిటీ 6వ సచివాలయం పరిధిలోని 8, 20, 28 వార్డుల్లో 'వై ఏపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని కౌన్సిలర్లు షేక్ కరిష్మా, హమీద్, రాధిక అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహత్ జబ్బార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్శపోగు ప్రశాంతి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ పాల్గొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించే బోర్డును, వైఎస్ఆర్సీపీ జెండాను ఆవిష్కరించారు. కౌన్సిలర్లు లాలు, రావూఫ్, దేశెట్టి సుమలత, పట్టణ ఉపాధ్యక్షుడు ఉపేంద్ర రెడ్డి, నాయకులు అబ్దుల్ జబ్బార్, రాజశేఖరప్ప, కాలూరి శివ ప్రసాద్, శాలి బాషా, బ్రహ్మయ్య ఆచారి, పి.రమేష్, సన అబ్దుల్లా, కురువ శీను, ఆర్ట్ శీనులు పాల్గొన్నారు.

పాములపాడు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్

డోన్ : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

కొలిమిగుండ్ల : వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న అంబటి గురువిరెడ్డి

ఆత్మకూర్ : జెండా ఎగురవేస్తున్న చైర్మన్ డాక్టర్ ఆసియా

మహానంది : మాట్లాడుతున్న ఎంపిపి బుడ్డారెడ్డి యశస్విని

బండి ఆత్మకూరు : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

రుద్రవరం : బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చాగలమర్రి : మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్

నంది బాలోత్సవం బ్రోచర్లు విడుదల

ప్రజాశక్తి - పాణ్యం

డిసెంబరు 28, 29 తేదీలలో నంద్యాలలో జరగనున్న నంది బాలోత్సవంను జయప్రదం చేయాలని కోరుతూ బ్రోచర్లను మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నంది విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు మిద్దె శివరాం నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు, భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం చైర్మన్ శంకరయ్యలతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ, పాటవాలను వెలుగులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వచ్చే నెల రెండు రోజులపాటు పిల్లల పండుగ నిర్వహించడం అభినందనీయమన్నారు.

నంది బాలోత్సవం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మిద్దె శివరాం తదితరులు

మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.P.No.6/2022 in O.S.No.149/2021

శీలం నడిపి యల్లప్ప. ...D.Hr

Vs

గొల్ల ఆదోని రమణయ్య. ...J.Dr

స్థిరాస్థి యొక్క బహిరంగ వేలం ప్రకటన

పైన తెలిపిన E.P అర్జిలోని DHr శీలం నడిపి యల్లప్ప తనకు రావలసిన అమలు అర్జి E.P మొత్తం రాబట్టుకొనుటకై JDr అయిన గొల్ల ఆదోని రమణయ్య యొక్క క్రింది షెడ్యూలు స్థిరాస్థిని వేలమునకు తెచ్చియున్నాడు. వేలంలో పాల్గొనదలచిన వారు పైన తెలిపిన కోర్టులో ఉదయం 10.30 గంటలకు 22-12-2023వ తేదిన హాజరై వేలంలో పాల్గొన వచ్చును.

షెడ్యూలు :

నంద్యాల జిల్లా రిజిస్ట్రేషను, డోన్ సబ్ రిజిస్ట్రారు, డోన్ పంచాయతీ పరిధిలోని భూమి.
సర్వేనెంబరు 415A AC 25-62 పైకి AC 2-00
సర్వేనెంబరు 414A2 AC 7-61 పైకి AC 1-00
మొత్తం: AC 3-00

ఇందుకు హద్దులు :-
తూర్పు : పెద్ద కొండప్ప భూమి
పడమర : మచ్చు కిష్టన్న భూమి
ఉత్తరము : పెద్దవెంకటేశు భూమి
దక్షిణం : వెంకటస్వామి భూమి
DHr అందాజు విలువ : రూ.3,00,000-00
కోర్టు అమినా విలువ : రూ.12,00,000-00

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ఇ.శ్రీనివాస రెడ్డి,
DHr పరం వకీలు,
డోన్,
నంద్యాల జిల్లా.